క్లుప్తంగా

అయ్యప్పస్వామి ఆలయంలో రేపటి నుంచి శరన్నవరాత్రులు

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వ్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కామాక్షి అమ్మవారి ఆలయంలో ఈ నెల 15 నుంచి 24 వరకూ నవ రాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ఆలయ పర్సన్ ఇన్‌చార్జి పి.గోపాలకృష్ణ శుక్రవారం విలేకర్లకు తెలిపారు. ప్రతి రోజు అమ్మవారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఆలయంలో ప్రతి రోజూ కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. కుంకుమ పూజల్లో పాల్గొనే మహిళలు ముందుకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వైభవంగా మూలమంత్ర అధివాస హోమం



మూలమంత్ర అధివాస హోమం నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: స్థానిక సినిమారోడ్డులోని సంతచెరువు వద్ద నున్న కనకదుర్గ అమ్మవారి ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉదయం అమ్మవారి ఆలయంలో గణపతి పూజ, సర్వ సూక్త పారాయణ, సహస్రలింగార్చన, సాయంత్రం చండీ, నవదుర్గ, మూల మంత్ర అధివాస హోమం, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి, దర్బారు సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణ దాత చిన బాబు మాట్లాడుతూ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తయారుచేసినట్లు చెప్పారు. ఆదివారం అమ్మవారి ప్రతిష్టాపన వైభవంగా జరుగుతుందన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే మంచి సమాజం



సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబంతో పాటు సమాజం ఆరోగ్యంగా ఉంటుందని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే ఎంపవర్‌మెంట్ ఆఫ్ వుమెన్ గ్రీవెన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సెనెట్ హాల్లో మహిళలు, బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఏఎల్ సత్యవతి, ఆర్ఎంసీ గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నదీప్తి పరిశుభ్రత, గర్భాశయ క్యాన్సర్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, మైత్రేయి వుమెన్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ సుశి, సత్యవాణి, ఆర్.ఉషారాణి పాల్గొన్నారు.

కొంగోడులో తాటాకిల్లు దగ్ధం



అగ్నిప్రమాదంలో బూడిదైన తాటాకిల్లు

కరప: మండలం కొంగోడులో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం కాగా ఒక కుటుంబం నిరాశ్రయమైంది. ఈ ప్రమాదంలో సుమారుగా రూ.5 లక్షల ఆస్తినష్టం సంభవించిందని ప్రాథమికంగా అంచనా వేశారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని ఎస్సీవీధిలో పత్తి శ్రీను, బుజ్జి దంపతులు, శ్రీను తల్లి కాంతమ్మ నివసిస్తున్నారు. శుక్రవారం కాంతమ్మ వంట చేస్తుండగా పొయ్యి నుంచి నిప్పు రవ్వలు ఎగసిపడి తాటాకిల్లు పూర్తిగా ఆహుతైంది. కాకినాడ నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేయడంతో ఘోర ప్రమాదం తప్పిందంటున్నారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని రెండు బీరువాలు, రెండు మంచాలు, మూడు సీలింగ్ ఫ్యానులు, వంట సామగ్రి, నగదు కాలి బూడిదయ్యాయి. వీఆర్వో ఎస్.మహాలక్ష్మి ఘటనా స్థలానికి వెళ్లి, అగ్ని ప్రమాద వివరాలు సేకరించి, తహసీల్దార్ పి.శ్రీనివాసరావుకు విన్నవించారు.

వ్యాన్ బోల్తా
ముగ్గురికి గాయాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలోని 216వ నంబర్ జాతీయ రహదారిపై భోగాపురం సెంటర్ వద్ద శుక్రవారం వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వేగంగా వస్తున్న వ్యాన్ భోగాపురం సెంటర్ వద్ద ఉన్న వేగ నివారణ బోర్డులను తప్పించబోయి ప్రమాదవశాత్తూ తిరగబడింది. వ్యాన్‌లో ఉన్న చవల లక్ష్మి, పిల్లా వీరబాబు, కాకర సుబ్బారావులకు స్వల్ప గాయాలవ్వగా వారిని 108లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీధి దీపాల నిర్వహణ మెరుగుపరచండి

- వారంలో రెండుసార్లు క్షేత్రస్థాయి పరిశీలన
- ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు
- కార్పొరేషన్ కమిషనర్ నాగ నరసింహారావు



వీధి దీపాల నిర్వహణపై సమీక్షిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: వీధి దీపాల నిర్వహణ మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్లో వీధి దీపాల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. వీధి దీపాల సమస్య పరిష్కారానికి ప్రతి సచివాలయ పరిధిలోని ఎమినిటీ సెక్రటరీలు వారంలో రెండు సార్లు కచ్చితంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని ఆదేశించారు. గుర్తించిన సమస్యలను సత్వరం సంబంధిత విభాగానికి తెలియజేసి పరిష్కరించాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో లైట్ల ఆన్ అండ్ ఆఫ్ విధానాన్ని సమర్థంగా నిర్వహించాలనన్నారు. నగరంలోని 900 ఆన్ అండ్ ఆఫ్ బాక్సులకు సుమారు 225 సెన్సార్ పద్ధతిపై నడుస్తున్నాయని, మిగిలిన వాటికి కూడా సెన్సార్లు అమర్చాలన్నారు. ఇందుకోసం రూ.90 లక్షలతో టెండర్లు పిలిచామన్నారు. ప్రస్తుతం నెల రోజుల అవసరాలకు తగినంతగా మాత్రమే వీధి దీపాల విడిభాగాలు అందుబాటులో ఉంటున్నాయని, కనీసం మూడు నెలలకు సరిపడినంతగా స్టాకును అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వీధి దీపాలతో పాటు తాగునీరు, పారిశుధ్య సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని ఆయన అధికారులు ఆదేశించారు. ఆ నెంబర్‌కు వచ్చే సమస్యలను 101 విభాగం, సంబంధిత సచివాలయానికి అనుసంధానం చేసి వేగంగా సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కోరారు. ప్రస్తుతం ఉన్న రెండు హైడ్రాలిక్ లేడర్లతో పూర్తిస్థాయి సేవలు అందించలేకపోతున్నామని అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా మరో హైడ్రాలిక్ లేడర్ కొనుగోలుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఈఈ వెంకట్రావు, ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాస్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, ఏఈ సాంబశివరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి



కార్యదర్శులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకంలో భాగంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ నాగ నరసింహారావు కోరారు. సర్వే విధుల్లో ఉన్న ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలకు ప్రభుత్వం సమకూర్చిన వంద ట్యాబ్‌లను శుక్రవారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన అందజేశారు. ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని సర్వేను మరింత పారదర్శకంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగ శాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి



బాలాత్రిపుర సుందరి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీ విజయరాజు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రానున్న దసరా వేడుకల్లో సాధారణ భక్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు అన్నారు. కాకినాడలోని దేవదాయశాఖ డీసీ కార్యాలయంలో శుక్రవారం దసరా ఉత్సవాల నిర్వహణపై ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. నిత్యం సుమారు లక్షమంది పైగా భక్తులు ఆలయానికి వచ్చే అవకాశం ఉన్నందున దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. నవావరణార్చనలో కొందరు భక్తులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని, పూజలు చేసుకుంటామని వచ్చిన వారికి అవకాశం ఇవ్వాలని ఈవో చింతపల్లి విజయభాస్కర్ రెడ్డికి డీసీ సూచించారు. దీంతో ఈఓ బదులిస్తూ ఈ పూజలను ఏటా 60 మందికి పైగా భక్తులు చేయించుకుంటున్నారని, మరింత మందికి అవకాశం ఇస్తే అక్కడ కూర్చుని పూజలు చేయించుకొనేందుకు స్థలం లేదని వివరించారు. ఏటా ఒకరికే ఈ పూజలు కాకుండా అందరికీ అవకాశం కల్పించాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వడ్డి ఫణికుమార్ మాట్లాడుతూ ఆలయ సిబ్బంది తక్కువగా ఉన్నారని, వేరే ఆలయాల్లో పని చేసే సిబ్బందిని ఇక్కడ నియమించాలన్నారు. అనంతరం డీసీ బాలాత్రిపుర సుందరి ఆలయంలో దసరా సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా దేవదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయించండి

- మార్ట్‌గేజ్ ప్రక్రియ వేగవంతం చేయాలి
- సమీక్షలో కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: టిడ్కో ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మార్ట్‌గేజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో టిడ్కో ఇళ్ల ప్రగతిపై ఆయన అధికారులతో సమీక్షించారు. తొలి విడత 1152 ఇళ్లలో కొన్నింటికి పెండింగ్‌లో ఉన్న మార్ట్‌గేజ్ ప్రక్రియను ఈనెల 21 నాటికి పూర్తి చేయాలన్నారు. రెండో విడత 904 ఇళ్లలో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే రిజిస్ట్రేషన్ పూర్తయ్యి మార్టిగేజ్‌కు సిద్ధంగా ఉన్న ఇళ్లకు మంజూరు కావలసిన 25 శాతం రుణాలను కూడా వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను కోరారు. లబ్ధిదారుల తరఫున అధికారులు బ్యాంకర్లతో సంప్రదించాలని సూచించారు. ఇప్పటికే తాళాలు స్వాధీనం చేసుకున్న లబ్ధిదారులు వెంటనే గృహప్రవేశాలు చేసేలా వారితో మాట్లాడాలని సూచించారు. సమావేశంలో టిడ్కో ఈఈ రీటా, డీఈ రాజు, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ రూరల్ కమిటీ మార్పు

కాకినాడ సిటీ: కాకినాడ పళ్లంరాజు నగర్ డైరీఫారం సెంటర్‌లోని ఫెయిత్ ఫెలోషిప్ టెంపుల్‌లో శుక్రవారం నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) కాకినాడ సిటీ, రూరల్ నాయకుల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు మోసా అబ్రహం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రానున్న రోజుల్లో జరగబోయే పరిణామాలను దృష్టిలో పెట్టుకుని కాకినాడ రూరల్ నియోజకవర్గ కమిటీని మార్పు చేసి కొత్త కమిటీని నియమించినట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా జోషి ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా జి.లాజరస్, కార్యదర్శిగా శ్యామ్‌సన్, కోశాధికారిగా కె.కిరణ్‌కుమార్‌లను ఎంపిక చేసి జిల్లా నాయకులు బిషప్ పి.ఎస్.లాజరస్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. కాకినాడ సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మోజెస్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, జనరల్ సెక్రటర్ ఎం.ఆశీర్వాదం, కాకినాడ సిటీ ఉమెన్స్ వింగ్ గౌరవ అధ్యక్షురాలు అనుపమ లాజరస్, యూత్ వింగ్ అధ్యక్షులు పి సాల్మన్‌రాజు, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు శోచనీయం



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశ వ్యాప్తంగా మతోన్మాద శక్తులు పేట్రేగిపోతున్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్ర మాల్యాద్రి అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు రక్షణగా ఉన్న చట్టాలను కూడా నీరుకారుస్తున్నారని విమర్శించారు. ఇంత వరకు బీజేపీ పాలిత రాష్ట్రాలకే పరిమితమైన దాడులు తెలుగు రాష్ట్రాలకు విస్తరించడం దారుణమన్నారు. ఎస్సీ,ఎస్టీ అత్యాచార కేసులు, ఇతర తీవ్ర నేరాలలో కూడా 41 సీఆర్‌పీసీ కింద బెయిల్ ఇప్పించేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వడం నేరాలను ప్రోత్సహించడమేనని మాల్యాద్రి పేర్కొన్నారు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత చట్టాలను పటిష్టంగా అమలు చేసి దళితులపై దాడులను నిరోధించాలని కోరారు.

రేపు రాష్ట్ర దళిత సదస్సు

దళిత సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ విధానాల కోసం స్థానిక సూర్యకళా మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర స్థాయి దళిత సదస్సు నిర్వహిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంద్ర మాల్యాద్రి తెలిపారు. శుక్రవారం సుందరయ్యభవన్‌లో ఈ సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసే కుట్రలను తిప్పి కొట్టడం, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవడం తదితర అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, మేధావులు పాల్గొని సదస్సు విజయవంతం చేయాలని మాల్యాద్రి కోరారు. సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, ఏపీ వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



ఉపాధ్యాయుడు కృష్ణమూర్తిని సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

బాలాజీచెరువు: నగరపాలక సంస్థ ఏఎఫ్‌సీ మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయుడు ఏవీఎస్ఎన్ కృష్ణమూర్తిని శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సత్కరించారు. రసాయనశాస్త్ర విభాగంలో జేఎన్‌టీయూకే నుంచి డాక్టరేట్ సాధించిన సందర్భంగా సత్కరించి అభినందనలు తెలిపారు. పీహెచ్‌డీ అర్హత గల ఉపాధ్యాయులు పాఠశాలలో బోధించడం ద్వారా విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించవచ్చని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయ పడ్డారు.

రక్షణ రంగంలో అవకాశాలు అధికం



రక్షణ రంగాల్లో ఉద్యోగావకాశాలను వీడియో క్లిప్ ద్వారా వివరిస్తున్న ప్రసాదరావు

కరప: పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివి, 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు తగిన దేహ దారుఢ్యం, సామర్థ్యం కలిగి ఉంటే దేశరక్షణ రంగంలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని కెరీర్ గైడెన్స్ ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు తెలిపారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. వీడియో క్లిప్పింగ్‌ల ద్వారా విద్యార్థులకు హెచ్ఎం ఎ.సాయిమోహన్, వీవీ రమణమూర్తి అవగాహన కల్పించారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు



నడకుదురులో మహిళకు కళ్లజోడు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కరప: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. నడకుదురులో శుక్రవారం సర్పంచ్ దేగల లలితకుమారి అధ్యక్షతన జరిగిన ఈ వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. నడకుదురు-1 గ్రామ సచివాలయం పరిధిలో 426 మంది శిబిరానికి రాగా మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్, డాక్టర్ పి.ఆశ తదితర వైద్య నిపుణులు పేషంట్లను పరీక్షించారు. మందులతో కూడిన కిట్లను రోగులకు అందజేశారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిడి బుచ్చిరాజు, పైలా గోవిందు, వై.కృష్ణార్జున, గ్రామ కార్యదర్శి పీఎస్సార్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనాత్మక పరిశీలనకే ఆనర్స్ కోర్సు

- ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రామ్మోహనరావు, కరస్పాండెంట్ డాక్టర్ చిరంజీవినీ కుమారి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానానికి అనుగుణంగా ప్రవేశపెట్టిన ఆనర్స్ కోర్సు విద్యార్థుల అధ్యయన అంశాన్ని పరిశోధనాత్మకంగా పరిశీలించడానికేనని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు పేర్కొన్నారు. స్థానిక ఐడియల్ డిగ్రీ కళాశాలలో మొట్టమొదటిగా ప్రవేశపెట్టిన డిగ్రీ నాలుగేళ్ల ఆనర్స్ కోర్సు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమగ్ర పరిశోధనాత్మక విద్యా విధానాన్ని నాలుగేళ్ల డిగ్రీలో విద్యార్థి తన నైపుణ్యాన్ని వెలికితీయాలని సూచించారు. ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ పూర్వ ప్రత్యేక అధికారి ఐవీ దోసగిరి పరిశోధన పద్ధతులు వివరించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన విప్లవాత్మక నూతన విద్యావిధాన ప్రయోగాన్ని తమ కళాశాలలో అమోదించి అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, పి.సురేష్‌వర్మ, ఎస్.రమేష్, ప్రిన్సిపాల్ టి.సత్యనారాయణ, ఆనర్స్ కోర్సు విభాగాధిపతి నాగేశ్వరరావు, స్వామిజీ, గవర్నింగ్ బాడీ సభ్యులు జీవీ కృష్ణంరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌పై అవగాహన సదస్సు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే యూనివర్సిటీలో శుక్రవారం ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ రామ్మోహనరావు హాజరై రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాదికు 83 విద్యాసంస్థలు న్యాక్ గుర్తింపు పొందాయని, అదే విధంగా ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సాధించాలన్నారు. ఎన్ఐఆర్ఎఫ్‌కు సంబంధించి టీచింగ్, లెర్నింగ్ ప్రాసెస్, పరిశోధన అంశాలు, విద్యార్థుల గ్రాడ్యుయేట్ అవుట్‌కమ్, అవుట్‌రీచ్, ఇన్‌క్లూజివిటీ అంశాలపై అవగాహన కల్పించారు. వీసీ ప్రసాదరాజు, రెక్టార్ రమణ, అనుబంధ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

రవి సేవలు ప్రశంసనీయం



ఏడీపీఆర్వో రవిని సత్కరిస్తున్న డీపీఆర్వో కార్యాలయ సిబ్బంది

కాకినాడ సిటీ: ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై ప్రచారం, మీడియా సంక్షేమ పథకాల అమలులో సహాయ పౌర సంబంధ అధికారి కె.రవి అందించిన సేవలు ప్రశంసనీయమైనవని సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి నాగార్జున కొనియాడారు. డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా పదోన్నతి పొంది విజయవాడ బదిలీపై వెళుతున్న రవిని శుక్రవారం డీపీఆర్వో కార్యాలయ అధికారులు, సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు. నాగార్జున మాట్లాడుతూ గడచిన మూడేళ్లుగా రవి అంకితభావంతో సేవలు అందించి అందరి అభిమానం చూరగొన్నారన్నారు. పాత్రికేయులకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమాలు వారికి అందించడంలో ఆయన సేవలు హర్షణీయమన్నారు. రవి మాట్లాడుతూ ఎన్నో విశిష్టతలు కలిగిన కాకినాడ జిల్లాలో పని చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. తనకు అన్ని విధాల సహకరించిన అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు. సమాచార శాఖ అధికారులు ఏఈఐఈ సీ బాబూరావు, కాకినాడ డివిజనల్ పీఆర్వో పి.రవి, ఏపీఆర్వో ఎస్.అజయ్, ఏఐఈ పీఆర్ఎస్ సిద్ధాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలకు కరప విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం యు.లీలామనోహర్ శుక్రవారం తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. 8వ తరగతి చదువుతున్న పి.సత్యసాయిప్రణీత్ కబడ్డీకి, పి.వైష్ణవి, పి.నీరజ్‌కుమార్ ఫుట్‌బాల్‌కు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి ఆటల పోటీలలో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం



నాగేంద్ర, అతడి తల్లికి చెక్ అందజేస్తున్న సతీష్

కాకినాడ క్రైం: ప్రమాదాలకు గురై శరీర భాగాలు చచ్చుబడి ఇంటికే పరిమితమైన రెండు కుటుంబాలను శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ ఆదుకుంది. కాకినాడకు చెందిన ఈశ్వర్ మెదడు సంబంధ అనారోగ్యానికి గురై కుడి వైపు శరీరమంతా చచ్చుబడి పోయింది. ఇంటికి ఆధారమైన ఈశ్వర్ మంచాన పడటంతో ఆ కుటుంబం కష్టాల పాలైంది. దీంతో శ్రీ యువసేన కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించింది. ఈ చెక్‌ను ఈశ్వర్ భార్య లక్ష్మికి సంస్థ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్ అందజేశారు. అలాగే, కాట్రావులపల్లికి చెందిన తోట నాగేంద్ర కొద్ది రోజుల క్రితం ద్విచక్రవాహన ప్రమాదానికి గురై తలకు గాయమై ఆసుపత్రి పాలయ్యాడు. ఆ సమయంలో కుడివైపు శరీరం చచ్చుబడింది. దీంతో సతీష్ ఈ కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం ఇరు కుటుంబాలకు గ్లాస్ హౌస్ సెంటర్‌లోని శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌లో ఈ చెక్‌లు అందజేశారు.

స్వామివారికి భస్మాభిషేకం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన ఉమా రామలింగేశ్వర స్వామి వారికి శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా భస్మాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు వీరబాబు, దత్తు సోదరులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సాహంగా మేరీ మిట్టీ-మేరీ దేశ్ కలశ్ యాత్ర



కరపలో మట్టి కలశంతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుక్రవారం మేరీ మిట్టి మేర దేశ్ కలశ్ యాత్ర నిర్వహించి మట్టిని కలశంలోకి సేకరించారు. ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతి శ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు తమ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేకరించిన మట్టిని తిమ్మాపురం పంచాయతీ కలశ యాత్రలో కలిపి ఢిల్లీ పంపిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.పోచయ్య, విజయశ్రీ, వరప్రసాద్, గోపి, హారిక, మహమ్మద్, నదీమ్, అప్పారావు, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి కలశంతో ర్యాలీ

కరప: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా ప్రభుత్వాధికారులు, విద్యార్థులతో కలసి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు శుక్రవారం మట్టికలశంతో కరపలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, అధికారులు మండలపరిషత్ సమావేశమందిరంలో సమావేశమై ఆగస్టు నెలలో సేకరించిన మట్టి కలశాలలోని మట్టిని ఒక కలశంలోకి తీశారు. ఈ కలశాన్ని ఈనెల 25వ తేదీన వారంతా ఢిల్లీలో అందజేస్తారని ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కలశ్ యాత్రలో భాగంగా మట్టిని సేకరిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు